క్లుప్తంగా

అధ్వానంగా రహదారులు



కొట్టుకుపోయిన మురళీగూడ రహదారి

పెంచికల్‌పేట్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రహదారులు, వంతెనలు కోతకు గురయ్యాయి. కమ్మర్‌గాం -మురళీగూడ రహదారిపై కోతలు ఏర్పడగా, గుండెపల్లి -కమ్మర్‌గాం, కమ్మర్‌గాం -నందిగామ వెళ్లే రహదారిలోని లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో గిరిపుత్రులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

దహెగాంలో భారీ వర్షం



దహెగాంలో కురుస్తున్న వర్షం

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు మధ్యాహ్న సమయంలోనే ఇళ్లకు చేరుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. పత్తి పూత, కాత దశలో ఉన్నందున వర్షం వల్ల పత్తి కాయలు నల్లబారుతున్నాయని పేర్కొంటున్నారు. పూతలో వర్షపు నీరు నిలిచి రాలిపోతుందన్నారు. వర్షాల వల్ల పంటలకు నష్టం కలుగుతుందని ఆవేదన చెందుతున్నారు. పూత, కాత రాలి కేవలం చెట్లు మాత్రమే మిగిలాయని, పత్తికి తెగుళ్లు సోకుతున్నాయని వాపోతున్నారు.

వాసవీ మందిరంలో ఘనంగా అన్నదానం



ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో శనివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శారదాదేవి నిమజ్జనం పురస్కరించుకొని నిర్వహించిన అన్నదానంలో పెద్దఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర మహిళా సమన్వయ సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో రెండు రోజుల పాటు తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చాపిలె సాయికృష్ణలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎస్పీఎం గ్రౌండ్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వినయ్‌గార్డెన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు మహిళా శ్రామిక కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరుపయోగంగా 'సోలార్ సిస్టం'



నిరుపయోగంగా మారిన సోలార్ సిస్టం

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా మారింది. గతంలో కుమురం భీం మ్యూజియం నిర్మాణానికి కావాల్సిన నీటి సౌకర్యం కోసం ఒక బోరు వేసి సోలార్ ద్వారా నీటిని అందించారు. మూడేళ్ల వరకు బాగానే పని చేసినప్పటికీ ఆ తర్వాత దానికి ఉన్న బోరు మాయమైంది. ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో రూ.2 లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదివాసీలు కోరుతున్నారు.

అత్యవసర వైద్యం అందేనా!

- సాయంత్రం నాలుగైతే పీహెచ్‌సీకి తాళం
- ఎనిమిది గంటలపాటు అందుబాటులో సిబ్బంది
- ప్రాథమిక వైద్యసేవలకే పరిమితం
- రౌండ్ ది క్లాక్ సేవలు అందించాలని డిమాండ్



లింగాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

లింగాపూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎనిమిది గంటల పాటు మాత్రమే వైద్య సేవలు అందిస్తుండడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ సరైన వైద్యం లభించక అత్యవసర సమయంలో ఆదిలాబాద్ జిల్లాలోని రిమ్స్‌కు, ఉట్నూర్, జైనూర్, ఆసిఫాబాద్‌లలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాలకు మండలంలోని ప్రజలు వెళ్లాలంటే కనీసం 30 నుంచి 100 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో లింగాపూర్ పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

రోజుకు 80కి పైగా ఓపీ..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 గ్రామపంచాయతీలు, సుమారు 20వేలకు పైగా జనాభా ఉన్నారు. ఈ ఆసుపత్రికి అనుసంధానంగా 2 సబ్‌సెంటర్లు ఉన్నాయి. లింగాపూర్ పీహెచ్‌సీకి ప్రతీరోజు ఓపీ 80 నుంచి 90 మంది వరకు వస్తుంటారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రోగులు, గర్భిణులు, వృద్ధులు ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతారు. అయితే రాత్రివేళ, అత్యవసర సమయాల్లో వైద్యం లభించక తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. లింగాపూర్ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 24 గంటల పాటు వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా వైద్యశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

సాయంత్రం నాలుగు గంటల వరకే..

లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అది కూడా చిన్నచిన్న రోగాలకు, ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందిస్తున్నారు. ప్రసవాలు, ఇతర ఏమైనా సమస్యలు, రోడ్డు ప్రమాదాల బాధితులకు చికిత్స అందించేందుకు ఇక్కడ సరైన సదుపాయాలు లేవు.

అప్‌గ్రేడ్ చేయాలి



పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పీహెచ్‌సీని 24 గంటల పాటు వైద్యసేవలు అందించేలా అప్‌గ్రేడ్ చేయాలి. అత్యవసర సమయాల్లో రిమ్స్‌కు, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నాం.

- ఆడే సురేశ్‌నాయక్, బీజేపీ మండలాధ్యక్షుడు

మెరుగైన సేవలు అందించాలి



లింగాపూర్ ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలి. పీహెచ్‌సీలో నిర్ణీత సమయంలో మాత్రమే వైద్యసేవలు అందిస్తుండడంతో రాత్రివేళ వైద్యం అందడం లేదు.

- బానోత్ అశ్విన్ నాయక్, లింగాపూర్

లోలెవల్ వంతెనలతో రాకపోకలకు తిప్పలు



ఐనం సమీపంలోని లోలెవల్ వంతెన వద్ద ప్రమాదకరంగా వరద (ఫైల్)



దహెగాం సమీపంలోని కల్వాడ మార్గంలో లోలెవల్ వంతెన వద్ద వరద (ఫైల్)

- వంతెనల ఎత్తు పెంచాలని స్థానికుల డిమాండ్

దహెగాం: మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే చుట్టూ నాలుగు దిక్కుల్లో లోలెవల్ వంతెనలు ఉండడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ వెళ్లాలంటే ఐనం గ్రామ సమీపంలో రెండు, మంచిర్యాల వైపు వెళ్దామన్నా మండల కేంద్రంలోని నయారా పెట్రోల్ పంపు వద్ద, పెంచికల్‌పేట్ వైపు మార్గంలో లగ్గాం సమీపంలో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పడుతున్నందున సంబంధిత అధికారులు లోలెవల్ వంతెనల వద్ద ఎత్తు పెంచే పనులు చేపట్టాలని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఉత్కంఠ రేపిన మేకల కాపరి అదృశ్యం



భీంరావ్‌ను అడవి నుంచి తీసుకొస్తున్న పోలీసులు

రెబ్బెన: మండలంలోని సోనాపూర్‌కు చెందిన టేకం భీంరావ్ అనే మేకల కాపరి శనివారం మేకలతో అడవికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడం ఉత్కంఠ రేపింది. గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్, అటవీశాఖ సిబ్బంది రాత్రి అడవిలో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ సంజయ్, ఎస్సై వెంకట్‌కృష్ణ, రెబ్బెన ఫారెస్ట్ రేంజ్ అధికారి భానేష్, బీట్ అధికారులు అనిల్, వెంకటేశ్‌తో పాటు సుమారు 20 మంది గ్రామస్తులు అటవీ ప్రాంతంలో భీంరావ్ ఆచూకీ కోసం వెతికారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సుమారు 3 గంటల తర్వాత అతని ఆచూకీ పట్టుకున్నారు. మేత కోసం తీసుకెళ్లిన మేకలు తప్పిపోగా యజమానులు తిడుతారేమో అనే భయంతో ఇంటికి రాలేదని అధికారులు తెలిపారు.

విద్యార్థినుల హాజరుశాతం పెంచాలి

నార్నూర్: దసరా సెలవులు ముగియడంతో విద్యార్థినుల హాజరుశాతం పెంచాలని జీసీడీవో ఉదయశ్రీ అన్నారు. శనివారం గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. క్రీడలు, కరాటేలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి త్వరగా పాఠశాలకు రప్పించే ప్రయత్నం చేయాలన్నారు.

దుర్గామాత నిమజ్జనంలో ఉద్రిక్తత



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన దుర్గా, శారదామాత నిమజ్జన శోభాయాత్రలో ఉద్రిక్తత నెలకొంది. శోభాయాత్రలో బ్రాహ్మణవాడ మహిళలపై ఓ ఎస్సై అనుచిత వ్యాఖ్యలు చేశారని పొట్టి శ్రీరాములు చౌక్ వద్ద నిర్వాహకులు ఆందోళనకు దిగారు. ఎస్సై తీరును నిరసిస్తూ రథాలతో పాటు నిర్వాహకులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్సై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐ బాలాజీ వరప్రసాద్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా ఎస్సై క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. ఏఎస్పీ చిత్తరంజన్ వచ్చి ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. కాగా, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. లేని పక్షంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. దీనిపై ఆదివారం హిందూ సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా, జిల్లా కేంద్రంలో జరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో పట్టణానికి చెందిన నలుగురితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారంటూ ఐదు డీజేలు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు పక్కన రక్షణ గోడలు



జోడేఘాట్ సమీపంలో రిబ్బన్‌తో అడ్డుకట్ట



పాట్నాపూర్ సమీపంలో మట్టి కుప్పలు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు మధ్యలో తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. రెండు వైపులా కోతకు గురై ఉండడంతో అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. బాబేఝరి, జోడేఘాట్, పాట్నాపూర్ గ్రామాల సమీపంలో ఉన్న కల్వర్టులకు కొన్ని చోట్ల వాహనాలు జారకుండా ఉండేందుకు మట్టికుప్పలు వేయగా, మరికొన్ని చోట్ల చిన్న రిబ్బన్‌తో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన రక్షణ గోడలు ప్రమాదాన్ని అడ్డుకుంటాయా? అని అటువైపు వెళ్లే ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరుతూ శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న అధ్యాపకులు ప్రిన్సిపాల్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉపాధ్యాయులకు సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం కనీస అర్హతకు తగ్గట్టుగా లేవన్నారు. మూడు నెలలకు సంబంధించిన పెండింగ్ వేతనాలు విడుదల చేయకుంటే చాక్‌డౌన్ నిర్వహిస్తామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, ప్రేమ్ కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వేతన బకాయిలు విడుదల చేయండి'

నార్నూర్: ఐదు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మిషన్ భగీరథ కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. పూసిగూడ పంపుహౌస్ వద్ద ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈనెల 10వరకు కనీసం మూడు నెలల వేతనాలు మంజూరు చేయాలని లేని పక్షంలో నీటి సరఫరాను నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఇందులో కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్తాచెదారం



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రావులవాడలో రోడ్డుపై చెత్తాచెదారం పేరుకుపోయింది. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తొలగించక పోవడంతో కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు లేక.. అభివృద్ధికి నోచక..

- సమస్యల్లో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పడిన రద్దీ

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటైంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పాలకవర్గ కాలపరిమితి ముగిసింది. ప్రస్తుతం రెండు మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో గత పాలకవర్గం హయాంలో ఆమోదించిన పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోవడం లేదు. నిధుల లేమితో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పట్టణంలోని ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది.

నిధులు లేక..

స్థానికంగా వచ్చే నిధులు స్థానికంగా చిన్న సమస్యలు, అవసరాలకే సరిపోతున్నాయి. టీయూఎఫ్ఐడీసీ ద్వారా రుణ ప్రతిపాదికన నిధులు అందించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలకు కలిపి రూ.30 కోట్ల నిధులు విడుదలవుతాయని భావించారు. పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జూలైలోనే అప్పటి కలెక్టర్ ద్వారా మున్సిపల్ శాఖకు పంపించారు. ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవడంతో మున్సిపాలిటీల్లో సమస్యలు అలాగే ఉన్నాయి.

సమస్యలు..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రోజురోజుకు జనాభా పెరిగిపోతుండడం.. ప్రధాన రహదారుల విస్తరణ లేకపోవడంతో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. రాజీవ్‌గాంధీ చౌరస్తా, తీరందాజ్‌టాకీస్ రోడ్డు, పొట్టి శ్రీరాములు చౌరస్తా, తెలంగాణ తల్లి చౌరస్తా, రైల్వే ఓవర్‌బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అడుగుకో గుంత ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతిపాదనలు..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి హరిద్వార్ లాడ్జి మీదుగా సంజీవయ్య కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, సర్‌సిల్క్‌లోని పోచమ్మ ఆలయం నుంచి దాదానగర్ చౌరస్తా వరకు సీసీరోడ్డు, బాలాజీనగర్ బోర్డు నుంచి శ్రీరాంనగర్ మీదుగా కౌసర్‌నగర్ వరకు రోడ్డు, శ్రీరాంనగర్ నుంచి బ్రహ్మణవాడ మీదుగా శంకర్ సైకిల్ షాపు వరకు రోడ్డు, ఆదర్శనగర్‌లోని పార్కులో సౌకర్యాల కల్పన, పర్దాన్‌గూడ ప్రధాన రోడ్డు నుంచి డంపింగ్ యార్డు వరకు సీసీ రోడ్డు, కాపువాడలో మసాల వాగు వరకు శాశ్వత ప్రధాన కాలువ నిర్మాణం, తెలంగాణ తల్లి చౌరస్తా, శివాజీ చౌరస్తా, రాజీవ్‌గాంధీ చౌరస్తా, విజయబస్తి చౌరస్తాల సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పట్టణ ప్రగతికి ప్రణాళిక సిద్ధం



పట్టణం ప్రగతి పథంలో నడిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. మున్సిపల్ ఆదాయం తక్కువగా, ఖర్చు ఎక్కువగా ఉంది. పట్టణంలో నిర్వహించాల్సిన పనుల ప్రణాళికలను ప్రభుత్వానికి అందజేశాం. నిధులు విడుదలైతే ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేస్తాం.

- రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలీ భవనంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన వొడ్నాల వెంకన్నను పద్మశాలీ సంఘం నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు సిందం చంద్రయ్య, నల్ల కనకయ్య, గుల్లపల్లినంద్, రాపెల్లి సదానందం, గుల్లపల్లి నాగేశ్వర్‌రావు, గడదాసు మల్లయ్య, దోమల సురవర్ధన్, కొంపెల్లి సుదర్శన్, నూతి సుదర్శన్, బంక శ్రీనివాస్, తేలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.